ప్రజాశక్తి

నేడు గురుకులాల ప్రవేశ పరీక్ష

సీతానగరం: డాక్టరు బి ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదట సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్షను ఆదివారం జరుగుతుందని జోగింపేట గురుకులం ప్రిన్సిపల్ కె.ఈశ్వరరావు తెలిపారు. 5వతరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటల నుండి 12.30 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు జరుగుతుందని తెలిపారు. స్థానిక పరీక్ష కేంద్రంలో 5వతరగతి ప్రవేశ పరీక్షకు 317మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 189మందిని జిల్లా అధికారులు కేటాయించారని తెలిపారు. జిల్లా కో ఆర్డినేటర్ చంద్రావతి అదేశాలు, సూచనలు మేరకు పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంటముందు పరీక్షా కేంద్రానికి రావాలన్నారు. ఈ ప్రవేశపరీక్షలో ర్యాంకులను బట్టి జిల్లాలోని గురుకులాల్లో సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు.

శిక్షణ లేక వెలవెల... జీతాల్లేక విలవిల

ఇదీ వైటిసిల దుస్థితి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో వైటిసిలను నెలకొల్పింది. శిక్షణ పొందే యువతకు వసతి, భోజనాలు కల్పించి సిబ్బందికి జీతాలు చెల్లించాలని ఉద్దేశంతో వేరేగా బడ్జెట్ కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం వైటిసిల్లో గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ లేక, సిబ్బందికి జీతాలు చెల్లించక నిర్వీర్యం చేసే నిధులు మంజూరు చేయడంలేదు.

రాష్ట్రంలో గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో 2015లో 27 వైటిసి (యూత్ ట్రెనింగ్ సెంటర్) మంజూరయ్యాయి. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, సాలూరులో వైటిసిలు ఉన్నాయి. అలాగే శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలో సీతంపేట, పాతపట్నం, శ్రీకాకుళం, మందసలో వైటిసిలు ఉన్నాయి. సీతంపేట, పాతపట్నం, మందస, శ్రీకాకుళం వైటిసిల్లో సుమారు 5వేల మందికి శిక్షణ ఇచ్చి 2వేల మందికి ఉపాధి కల్పించారు. ఇక సిబ్బంది వేతనాలకు సంబంధించి ప్రస్తుత వైసిపి ప్రభుత్వం రెండేళ్ల క్రితం గవర్నమెంట్ ఏజెన్సీ అప్కోస్ సంస్థకు (ఆప్కోస్)కు అప్పగించి వారి ద్వారా జీతాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వైటిసిల్లో 24 మంది పనిచేస్తున్నారు. అయితే 17 నెలలుగా జీతాలు చెల్లించక మూడేళ్లుగా శిక్షణ లేక వైటిసిలో వెలవెలబోతున్నాయి. సిబ్బందికి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించాలని ప్రజాప్రతినిధులకు, ఐటిడిఎ అధికారులకు వినతులు సమర్పించినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇటీవల కాలంలో ప్రభుత్వం వైటిసిలను అద్దెకు ఇచ్చి వచ్చిన అద్దెతో సిబ్బందికి జీతాలు చెల్లించాలని ఐటిడిఎకు ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. పార్వతీపురం వైటిసి కేంద్రాన్ని ఎస్పి కార్యాలయంగా మార్చడంతో అక్కడి సిబ్బందిని గుమ్మలక్ష్మీపురానికి బదిలీ చేశారు. సాలూరు వైటిసిలో గర్భిణుల హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. సీతంపేట వైటిసిలో ఆధార్ కేంద్రం, పాతపట్నం వైటీసీలో ఏకలవ్య పాఠశాల, శ్రీకాకుళం వైటిసిలో సూపర్ సిక్స్, మందసలో కృష్ణపట్నం పోర్టు సిబ్బందికి అద్దెకు ఇచ్చారు. కానీ జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి వద్ద ప్రస్తావించగా బడ్జెట్ రాలేదని సమాధానం ఇచ్చారు.

మిగతా జిల్లాల మాదిరిగా జీతాలు చెల్లించాలి

నెల్లూరు, అల్లూరి సీతారాములు రాజు జిల్లాల్లో ఆప్కోస్ ద్వారా జీతాలు చెల్లిస్తున్నారు. అదే మాదిరిగా మాకు జీతాలు చెల్లించాలి. వైటిసిల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ జీతాలు మాత్రం చెల్లించడం లేదు.

కె.శ్రీనివాసరావు, వైటిసి మేనేజర్.

నిత్య నూతన మార్గదర్శకుడు లెనిన్

సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కె. మన్మథరావు

లెనిన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, మన్మథరావు

ప్రజాశక్తి -కలెక్టరేట్

మార్క్సిజం నిత్య నూతన మార్గదర్శకుడు లెనిన్ అనిసిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కె.మన్మథరావు కొనియాడారు. లెనిన్ 153వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక సుందరయ్యభవనంలో సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోపిడి, పీడనల నుంచి మానవ జాతిని విముక్తి చేసేందుకు ఈ భూమండలంపై ఆవిష్కరించబడిన గొప్ప శాస్త్రీయ సిద్ధాంతం మార్క్సిజం అని, అన్ని సంపదలకు మూలం శ్రమ అని, చరిత్ర పురోగతికి పరస్పర విరుద్ధ శక్తుల ఘర్షణే కారణమని, చరిత్రను నిర్మించేది ప్రజలేనని, ప్రస్తుత దశలో కార్మికవర్గ ప్రత్యేకత, దాని నాయకత్వ శక్తిని ప్రకటించి, రానున్న సమసమాజ నిర్మాణానికి మార్క్స్, ఎంగెల్స్‌లు సిద్ధాంత పునాది వేశారని అన్నారు. నేడు భారతదేశంలో మితవాద శక్తులు రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొని పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య వ్యవస్థలను, విలువలను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. ఈ ఆధునిక కాలంలో ప్రాచీన కాలం నాటి మత విశ్వాసాలను, మూఢాచారాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని, దేశ చరిత్రను వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. ఒకవైపు కార్మిక వర్గ హక్కులను కాలరాసి, వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించి, నిరుద్యోగం, దారిద్ర్యం, ఆకలిని పెంచి పోషిస్తున్నాయని అన్నారు. దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు, వ్యక్తులకు అప్పగించేస్తున్నాయన్నారు. రాజకీయ పక్షాలన్నింటినీ తమ గుప్పిట్లోకి తెచ్చుకొని దేశాధిపత్యం సాధించాలని చూస్తున్నాయన్నారు. దేశంలోని భిన్న సంస్కృతులు, ఆచారాలు, భాషలు, జాతులన్నింటినీ మతం ఆధారంగా ఏకీకృతం చేయడానికి సిద్ధమయ్యాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ సైద్ధాంతిక, రాజకీయ శక్తిగా ప్రజల ముందు నిలిచి, ప్రజలను సమీకరించి, పోరాడాల్సిన చారిత్రక కర్తవ్యం నేటి కమ్యూనిస్టు ఉద్యమంపై ఉందని, లెనిన్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, బి.సూరి బాబు, కె.గోపీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో లెనిన్ జయంతి సభ జరిగింది. లెనిన్ చిత్రపటానికి రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరునాయుడు, గిరిజన సంఘం నాయకులు తామర గణేష్, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా ఉంటాయని కమ్యూనిస్టులు ఆచరణాత్మక కార్యకలాపాల లక్ష్యం సంబంధించి అనేక గ్రంథాలను లెనిన్ మానవాళికి అందించారని అన్నారు. నేడు లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరి పైన ఉందని అన్నారు.

బిజెపిని సాగనంపుదాం..

పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజానీకానికి తీవ్ర నష్టం చేస్తుందని, రాజ్యాంగంపై దాడి చేస్తూ, మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుందని, ఇటువంటి ప్రభుత్వాన్ని సాగినంపి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని సిపిఎం నాయకులు అన్నారు. సిపిఎం ప్రచార భేరిలో భాగంగా మండలంలోని బుడ్డిపేట, జోగింపేట, సీతానగరంలోని సుంకరవీధి, మెట్టివీధి, దేవరవీధుల్లో ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, జి.వెంకటరమణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్లో కోతలు విధించిందని, నిత్యవసర వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తుల ధరలను విపరీతంగా పెంచి, దేశ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు దేశ ఆర్థిక వ్యవస్థను తాకట్టుపెట్టేలా ఆర్థిక విధానాలు రూపొందించి అమలు చేస్తుందని విమర్శించారు. కావున బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకమై సిపిఎం, వామపక్షాలు చేస్తున్న ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు వై.రామారావు, పి.చిన్నారావు, జి.మాలతి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సారిక పంచాయతీ కొత్తూరు, తోణాం పంచాయతీ పులివలసలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన అటవీ విధానాన్ని రద్దు చేయాలని, గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని అమలు చేయాలని, గిరిజన ప్రాంతంలో అక్రమ మైనింగ్ ఆపాలని డిమాండ్ చేశారు. దేశాన్ని అథోగతి పాల్జేస్తున్న మోడీని గద్దె దింపాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గెమ్మెల బోడమ్మ, సూరయ్య, చింతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణకు పోరాడాలని, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని, దానికి సహకరించే శక్తులను వ్యతిరేకించాలని సిపిఎం-సిపిఐ పార్టీ ప్రచార భేరిలో భాగంగా వెంకంపేటలో ఉపాధి హామీ వేతనదారులతో కలిసి సిపిఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పాల్పడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. పార్వతీపురంలో జరిగే సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా, వై.మన్మథరావు, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : ఉపాధి వేతనదారులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సాలూరు: మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా రవాణా రంగం కుదేలయ్యే పరిస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్ని నాయుడు, సిపిఐ నాయకులు టి.జీవ చెప్పారు. పట్టణ సమీపంలోని లారీ యజమానుల సంఘం, మోటార్ ట్రాన్స్ పోర్ట్ కార్మికుల సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బిజెపి రవాణా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని, లారీ యజమానులు, మోటార్ కార్మికులు మనుగడ సాధించలేని దుస్థితిలో ఉన్నారని చెప్పారు. పెట్రోల్, డీజిల్‌పై పెంచిన పన్ను భారం, టోల్ గేట్ ఫీజుల పెంపు, ఆర్‌టిఎ అధికారుల వేధింపులతో రవాణా తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిస్తూ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో లారీ యజమానుల సంఘం ప్రతినిధులు రమేష్ పాల్గొన్నారు.

కొమరాడ: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపైన జరిగే ప్రచార బేరి కార్యక్రమాన్ని కూనేరు సంతలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు ఎం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎనిమిది సంవత్సరాల పరిపాలన కాలంలో సామాన్య ప్రజానీకానికి తీవ్ర నష్టం చేసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్లో కోతలు విధించిందని, దీనివల్ల వ్యవసాయ కూలీలు పనిరోజులు తగ్గిపోయి భవిష్యత్తులో కూలీలకు నష్టం జరిగే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ప్రసాదు, నాగేశ్వరరావు, వెంకన్న, శోభన, ఈశ్వరరావు, ఆనంద్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం అవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురం పట్టణం 18, 19 వార్డుల్లో ఇంటింటికి ప్రచార భేరీ కార్యక్రమాన్నిసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ ప్రచారభేరిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి. ఇందిరా, పట్టణ నాయకులు జి.వెంకటరమణ, బి.సూరిబాబు, పి.రాజశేఖర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ప్రచార భేరిలో నాయకులు

24 నుంచి జరిగే బహిరంగ సభలను జయప్రదం చేయండి

కలెక్టరేట్ : ప్రజా, గిరిజన, కార్మిక వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపి విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం-సిపిఐ ప్రచారభేరిలో భాగంగా ఏప్రిల్ 24 నుంచి 27వరకు రాష్ట్ర కార్యదర్శులు, నాయకులు హాజరయ్యే బహిరంగ సభలను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో సిపిఐ-సిపిఎం నాయకుల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిజెపిని సాగనంపుదాం- దేశాన్ని కాపాడుకుందాం, మోడీ కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ విధానాలపై ఏప్రిల్ 14 నుండి 30 వరకు జరిగే ప్రచారం భేరిలో భాగంగా జిల్లాలో సిపిఐ-సిపిఎంలు నియోజకవర్గ సభలు ఈనెల 24న పాలకొండలో జరిగే బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బారావమ్మ, 25న జిఎల్‌పురంలో జరిగే బహిరంగ సభకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, 26న సాలూరు కె.సుబ్బారావమ్మ, పి.కామేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి, 27న పార్వతీపురంలో జి.ఈశ్వరయ్య, ఎం.కృష్ణమూర్తి, మన్యం జిల్లా కార్యదర్శులు కె.మన్మథరావు, రెడ్డి వేణు హాజరౌతారని తెలిపారు. కావున ఆయా మండలాల ప్రజలు తప్పక హాజరై సభల్లో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, వామపక్ష నాయకులు జి.వెంకటరమణ, వై.మన్మథరావు, వి.ఇందిర, ఆర్.శ్రీదేవి, కె.గోపినాయుడు పాల్గొన్నారు.

పైలట్ వాటర్ స్కీంను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పైలట్ వాటర్ స్కీంలను ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. శనివారం పట్టణంలోని 26వార్డు వెంకటేశ్వరా కాలనీ, ఒకటో వార్డు రైల్వే స్టేషన్ రోడ్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4.9 లక్షలతో రెండు పైలట్ వాటర్ స్కీమ్‌ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలతోపాటు అభివృద్ధి పనులకూ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్‌లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, వైసిపి నాయకులు ఆర్.అప్పారావు, కమిషనర్ హెచ్.శంకరరావు, ఎఇ సూరినాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్సులు పి.రామచంద్రరావు, కంది వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేయాలని, డిఎలు విడుదల చేయాలని, పిఆర్‌సి ఒప్పందాలు అమలు చేయాలని, 1వ తేదీనే జీతాలు చెల్లించేలా చట్టం చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ న్యాయపరమైన ఇబ్బందులు తొలగించడానికి కృషి చేయాలని, కార్యదర్శుల గ్రేడ్లు 6 స్థానంలో, 2 లేక మూడుకు కుదించాలని, పెన్షనర్ల, కంటింజెంట్, కాంట్రాక్టు, అర్‌టిసి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనేపథ్యంలో ఈనెల 30న రాజమండ్రిలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యానికి

ఉద్యోగులను బలి చేయడం సమంజం కాదు

వీరఘట్టంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వ వైఫల్యాలకు ఉద్యోగులను బలి చేయడం సమంజసమేనని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు ప్రశ్నించారు. సస్పెండ్ చేసిన డిఇఒ, వీరఘట్టం ఎంఇఒ, కెజిబివి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు సరిపడా పుస్తకాలు పంపిణీ చేయలేదని, విద్యా సంవత్సరం ముగిసినా విద్యార్థులకు పుస్తకాలు అందని దుస్థితి నెలకొన్న విషయాన్ని కిందిస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు పలుమార్లు తెలిపినా స్పందించలేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటన సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు అందకపోవడానికి కింది స్థాయి అధికారులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. పుస్తకాలు ఇవ్వాల్సింది, జగనన్న కిట్లు, వంటపాత్రలు, టాయిలెట్ల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రవీణ్ ప్రకాష్‌దని, ఆయన చేయాల్సిన పనులు చేయకుండా కింది స్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేయడం ప్రభుత్వం చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవడమేనని అన్నారు. ఇలాంటి వైఖరిని విడనాడాలని లేనిపక్షంలో ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతుతో పాటు ప్రత్యక్ష ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. తక్షణమే సస్పెండ్ చేసిన అధికారులను, సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఇప్పటికైనా పిల్లలందరికీ సరిపడేలా ముద్రించి విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి ఇందిర పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

గుమ్మలక్ష్మీపురం : డిఇఒ, ఎంఇఒ, కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారుల సస్పెన్షన్ లో ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం గుమ్మలక్ష్మీపురంలో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ మేరకు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వైఖరి మారాలని, తక్షణ సస్పెన్షన్లు ఎత్తివేయాలని లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్, ఎపిటిఎఫ్, పిఆర్టియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

వీరఘట్టం : నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న డిఇఒ ఎస్‌విడి రమణ, ఎంఇఒ పి.కృష్ణమూర్తి, కెజిబివి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రోజా రమణిల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ మండలంలోని నడుకూరులో అంబేద్కర్ విగ్రహానికి ఉపాధ్యాయ జెఎసి నాయకులు వినతిపత్రం అందజేశారు. తప్పు ఎవరిది... శిక్ష ఎవరికి... సస్పెన్షన్ తక్షణమే రద్దు చేయాలని, నినాదాలు చేశారు. అనంతరం మోకాలుపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ మండల జెఎసి నాయకులు ఎం.పైడిరాజు, కెటి పోలినాయుడు, జి దుర్గాప్రసాద్, డి.శ్రీనివాసరావు, బి.అప్పలనాయుడు, కె.విజయకుమార్, ఎస్.రమేష్, కె.గోవిందరావు, ఎ.చంద్రమౌళి, వి.అన్నాజీరావు, ఎన్‌వి భాస్కరరావు, సిహెచ్ తిరుపతిరావు ,తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: జిల్లాలో పర్యటించిన సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ డిఇఒ డాక్టరు ఎస్ డివి రమణను, వీరఘట్టం, సీతమ్మపేట మండలాల విద్యాశాఖ అధికారులను, కెజిబివి ప్రిన్సిపాల్, మరో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే టిడిపి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కొంతమంది అధికారులు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. వెంటనే వారి సస్పెన్షన్ ఎత్తివేయాలని తమ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

చేను చెల్లుపోయాక కళ్లం కాపు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



'చేను చెల్లిపోయాక కల్లం కాపు' అంటే ఇదేనేమో... లేకపోతే ఇందేంటండి బాబు.... మరో వారం రోజుల్లో బడులకు వేసవి సెలవులు రానున్నాయి. ఇప్పటికే పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఈ సమయంలో పుస్తకాల గొడవేంటిరా బాబు' ఇదీ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పబ్లిక్ టాక్. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవడం తప్పుకాదు. కానీ, ఈ పని ఎప్పుడో చేయాల్సివుంది... ఇంత ఆలస్యంగా స్పందించడం మాత్రం తప్పుకాదా? అంటూ మరికొందరు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం మన్యం జిల్లాలో గురు, శుక్రవారాల్లో పర్యటించిన విషయం విధితమే. రాత్రి వరకు ఆకస్మిక తనిఖీలు చేయడంతో అధికారులు పరుగులు తీశారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లిమరీ లోపాలను ఎత్తిచూపారు. వాటి పరిష్కారానికి అధికారులు, సిబ్బందికి ఎన్నో సూచనలు, ఆదేశాలు చేశారు. ఇంత వరకు బాగానేవున్నా వీరఘట్టం మండలం రేగులపాడు కెజిబివికి పుస్తకాలు అందకపోవడం పట్ల డిఇఒ, ఎంఇఒ, అసిస్టెంట్ గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, కెజిబివి ప్రిన్సిపాల్ లను సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం తప్పు కాదని, పుస్తకాల పంపిణీలో జాప్యానికి కేవలం అధికారులనే బాధ్యులు చేయడం బాధాకరణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందుకు బలమైన కారణాలనే ఎత్తిచూపుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 3384 ప్రభుత్వ స్కూళ్లు, దాదాపు 800 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ స్కూళ్లలో 2,31,137మంది, ప్రైవేటు స్కూళ్లలో 80వేల మంది ఉన్నట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరిలో 9,10 తరగతులకు 9రకాలు, 8వ తరగతికి 8రకాలు, 6,7 తరగతులకు 6రకాలు, 3,4,5 తరగతులకు 4నుంచి 5రకాలు, 1, 2 తరగతులకు 2రకాల చొప్పున 25లక్షలకుపైగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాల్సివుంది. కానీ, జులై 15వ తేదీ వరకు ఈ రెండు జిల్లాల్లో కేవలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 14,31,141 పుస్తకాలు పంపిణీ చేశారు. ఇందులోనూ 6వ తరగతి విద్యార్థులకు ఆరు రకాల పుస్తకాలు పంపిణీ చేయాల్సివుండగా దాదాపు అన్ని స్కూళ్లకూ మూడు రకాల పుస్తకాలు మాత్రమే అందాయి. అప్పటికి కొన్ని స్కూళ్లకు తెలుగు, సైన్స్, ఇంగ్లీషు మాత్రమే ఇచ్చారు. మిగిలిన స్కూళ్లకు లెక్కలు, హిందీ, సోషల్ పుస్తకాలను సర్దుబాటు చేశారు. పుస్తకాల కొరతను తెలియనివ్వకుండా ఇలా సర్దుబాటు చేసిన విషయం అప్పట్లో ఉపాధ్యాయులు గుర్తించారు. అరకొరగా వచ్చిన పుస్తకాలు ఎవరికి పంచాలో అర్థం కాక ఉపాధ్యాయులు అప్పట్లో తలలు పట్టుకున్నారు. ఇంకోవైపు సకాలంలో పుస్తకాలు అందజేయకపోతే పాఠ్యాంశాలు ఎలా బోధిస్తామని, సంవత్సరాంతంలో ఫలితాలు తగ్గితే వేధింపులకు గురిచేస్తారని ఉపాధ్యాయులు వారిలో వారే గుసగుసలాడుకునే పరిస్థితి కనిపించింది. దీంతో, అప్పట్లో ప్రభుత్వ తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపించాయి.

నూతన విద్యావిధానంలో భాగంగా ఉన్నత పాఠశాలలకు మూడు కిలోమీటర్లలోపుగల ప్రాథమిక పాఠశాలను విలీనం పేరిట మూసివేసేందుకు చూపిన శ్రద్ధ పాఠ్యపుస్తకాల ముద్రనపై ప్రభుత్వమే అప్పట్లో శ్రద్ధ చూపలేదు. దీనికితోడు కొన్ని ముద్రణా సంస్థలపై అమితమైన ప్రేమ కనబరుస్తూ ఎక్కువ ఆర్డర్లు ఇవ్వడం వల్ల సకాలంలో ప్రింటింగ్ కాలేదు. చివరికి పాఠ్యపుస్తకాల ప్రచురణలోనూ సర్కారు వ్యాపార ధోరణి అవలంభించడంతో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు 100శాతం పుస్తకాలు అందరికీ అందిపోయినట్టు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేశారు. మరికొన్ని చోట్ల నేరుగా సచివాలయాల్లోని బయోమెట్రిక్ మిషన్లు పట్టుకుని ఏకంగా వాలంటీర్లు రంగంలోకి దిగారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్టుగా ప్రభుత్వమే పుస్తకాలన్నీ ఇచ్చేసినట్టు లెక్కలు చూపించమని ఒత్తిడి చేయంతో ఆ తరువాత వచ్చిన పుస్తకాలు మూలనపడేసి ఉండవచ్చు. ఆలస్యంగా వచ్చిన పుస్తకాలు పాఠశాలలకు వెళ్లాయా? లేదా? అన్నది కూడా బహుశా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కూడా ఆలస్యంగానే పరిశీలించారు. రాజు తలచుకుంటే కొరడా దెబ్బలే కరువా? అన్నట్టు ఎంతైనా ముఖ్యకార్యదర్శి కాబట్టి డిఇఒ సహా నలుగుర్ని సస్పెడ్ చేశారు. ఇప్పటికైనా చేను చెల్లిపోయాక కల్లం కాపు మాదిరిగా పాఠశాల మూసివేత దశలో కాకుండా ప్రారంభంలోనే పుస్తకాలు వెళ్లాయా? లేదా? అనేది చూసుకుంటే మంచిదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

తిరుపతిరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

'ఆత్మ' చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం రూరల్ : మండలంలోని కవిటి భద్రకు చెందిన ఆత్మ చైర్మన్, వైసిపి నాయకులు యాండ్రాపు తిరుపతిరావుకు శస్త్ర చికిత్స జరిగిన సంగతి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ఆయన స్వగ్రామానికి వెళ్లి పరామర్శించారు. తిరుపతిరావు సతీమణి గ్రామ సర్పంచ్ అయిన ఉషారాణి, కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి విశ్రాంతి తీసుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

సహకార సంఘాలకు నూతన అధ్యక్షులు

సీతానగరం : మండలంలోని అంటిపేట, తామరకండి, ఆర్.వెంకంపేట వ్యవసాయ సహకార సంఘాల నూతన అధ్యక్షులను పార్వతీపురం ఎమ్మెల్యే ఎ.జోగారావు సిఫారసులు మేరకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంటిపేట సహకార సంఘానికి బొన్నాడ సత్యనారాయణ, తామరకండికి మూడడ్ల మన్మధరావు, ఆర్.వెంకంపేటకు రెడ్డి సూర్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

భూ సర్వే వేగవంతం

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ రమణ

సీతానగరం : గ్రామాల్లో భూ రీ సర్వే వేగవంతం చేయాలని తహశీల్దార్ ఎం.వి. రమణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ కార్యదర్శి, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న భూ రీ సర్వే కార్యక్రమం ద్వారా 35 పంచాయతీల్లో భూ సర్వే చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో పూర్తిస్థాయిలో భూ సర్వే అయినప్పటికీ మిగతా పంచాయతీల్లో జరగాలన్నారు. భూ రీసర్వే జరిగేటప్పుడు ఆయా గ్రామ రెవెన్యూ కార్యదర్శి సర్వేలు పక్కా ప్రణాళికతో ఉండాలన్నారు. కార్యక్రమంలో భూ సర్వే డిడి చిట్టెమ్మ, ఆర్ఐ వేణు, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న పెంట తిరుపతిరావు, తదితరులు

పేదలకు చీరలు పంపిణీ

మక్కువ : మండలం లోని మార్కొండ పుట్టి గ్రామంలో శనివారం పేదలకు చీరల పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సిహెచ్ అప్పమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా టిడిపి మాజీ మండల అధ్యక్షులు పెంట తిరుపతిరావు చేతుల మీదుగా నిరుపేదలకు చీరలను అందజేశారు. అనంతరం పాత ఘశిల కొత్తఘసిలా గ్రామాల్లో గిరిజనులకు సుమారు 100 చీరలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ బుచ్చినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ

గుమ్మలక్ష్మీపురం : నిదానమే ప్రధానం అనే సూక్తిని పాటిస్తూ వాహనదారులు తమ వాహనాలను నడపాలని ఎల్విన్ పేట ఎస్ఐ షణ్ముఖ రావు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలుచోట్ల ఉన్న మలుపుల వద్ద, నిత్యం జరుగుతున్న ప్రమాద స్థలంలో ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఆయన శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఆటోలు, ట్రక్కర్లపై పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ప్రారంభం నుంచి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాలని సూచించారు.

క్రీడాకారులను తయారు చేయండి

స్టేడియాన్ని పరిశీలిస్తున్న శాప్ సిఇఒ రామ్‌గోపాల్

సీతంపేట: మంచి క్రీడాకారులను తయారు చేయాలని ఎపి స్పోర్ట్స్ అథారిటీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల శాప్ సిఇఒ బి. రామ్ గోపాల్ అన్నారు. శనివారం ఐటిడిఎ సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ స్టేడియంను ఆయన సందర్శించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, బాడ్మింటన్, టెన్నిస్ చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేసవి శిబిరాలు నిర్వహించాలన్నారు. అవసరమైతే శిక్షణ కోచ్‌లను ఇస్తామన్నారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ సంబంధించి ఏవైనా ఉంటే ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. కొత్త గేమ్స్ నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్ జాకప్ దయానంద్ తదితరులు ఉన్నారు.

ఉదయం వాన... సాయంత్రం ఎండ

కురుపాం: గిరిజన ప్రాంతంలో కురుస్తున్న వర్షం

కురుపాం : కురుపాం పరిసర గిరిజన గ్రామాల్లో శనివారం ఉదయం వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న గర్భిణీలకు, వృద్ధులకు, వికలాంగులకు, చిన్న పిల్లలకు ఉక్క పోతనుంచి కొంత ఉపశమనం లభించింది. సాయంత్రం వరకు మబ్బుగా చల్లని వాతావరణం ఉన్నప్పటికీ తిరిగి సాయంత్రమయ్యేసరికి ఒక్కసారిగా ఎండ ఎక్కువగా ఎక్కి మళ్లీ వేసవిని తలపించి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ రెండు రకాల వాతావరణం కురుపాం పరిసర ప్రాంతాల్లో శనివారం చోటుచేసుకుంది.

సీతంపేటలో వర్షం

సీతంపేట: గత వారం రోజులుగా విపరీతమైన ఎండలతో అల్లాడిపోతున్న జనానికి శనివారం కురిసిన వర్షం ఉపసమనాన్ని కలిగించింది. ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం కురవడంతో వాతావరణ చల్లబడింది. దీంతో రైతులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే మామిడి రైతులు మాత్రం నష్టపోతామని వాపోతున్నారు.

చిరకాల ఆశ ... ఉద్యోగంతో భరోసా

ప్రజాశక్తి - బలిజిపేట

1998లో ఉపాధ్యాయ పరీక్షలో ఉత్తీర్ణతై అర్హత సాధించిన వారిలో శీరాపు శంకరరావు ఒకరు. కొన్నేళ్ల పాటు అందరితో సహా న్యాయం కోసం పోరాటం చేసి అలిసిపోయారు. ఉద్యోగం కోసం ఎదురు చూసి ఎన్నో అష్ట కష్టాలు పడ్డారు. వివిధ రంగాల్లో వేర్వేరు ఉద్యోగాలు చేస్తూ కుటుంబ పోషణకు పరితపించాడు. ఉద్యోగం రాలేదన్న నిరాశ ఒక వైపు, విద్య కొనసాగిస్తుండగా తండ్రి మరణంతో ముగ్గురు అక్క చెల్లెళ్ల బాధ్యత అతనిపై పడింది. ఎప్పటికైనా ఉపాధ్యాయుడిగా కొనసాగితే సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆలోచన అతనిలో బలంగా నాటుకుంది. ఎట్టకేలకు ఉపాధ్యాయ ఉద్యోగం రావడంతో ఇన్నాళ్లకు తన కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే....

మాది అరసాడ గ్రామం. నాన్న నేను డిగ్రీ చదువుతున్న సమయంలో 1992లో చనిపోయారు. ఆడపిల్లలతో నిండుకొని ఉన్న కుటుంబం మాది. చేనేత వృత్తి చేసుకుంటూ వారి బాధ్యత చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక బాధ్యత వెనుక మరొక బాధ్యత వస్తూనే ఉంది. చదువు కాస్త కష్టమైంది. ఆస్తులేమీ లేవు. అనేక రకాల ఆర్థిక ఇబ్బందులు నన్ను వెంటాడి వెంటాడించాయి. 1993లో మద్రాస్ లోనే అన్న మలై విశ్వవిద్యాలయంలో బీఈడీ పూర్తి చేసుకునే టీచర్ ఉద్యోగం సంపాదనకై పట్టుదలతో రాత్రీపగలు చదివి కష్టపడి 1998లో డిఎస్‌సిలో ఉత్తీర్ణత సాధించాను. ఇంటర్వ్యూ కూడా పూర్తిచేసుకుని ఉద్యోగం తప్పక వస్తుందని ఆశతో ఎదురు చూశా. అప్పటి ప్రభుత్వ పోస్టులను కుదింపజేసి తక్కువ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయడం వల్ల నేను అప్పట్లో ఉద్యోగం పొందలేకపోయాను. నాన్న మృతితో ముగ్గురు ఆడపిల్లలను, కుటుంబ బాధ్యతలను నాపై పెట్టారు. 1993లో వివాహం కూడా అనుకూల పరిస్థితిలో చేసుకోవాల్సి వచ్చింది. అప్పట్లో కుటుంబ పోషన నిమిత్తం వైజాగ్‌లో వివిధ రంగాల ఉద్యోగాల్లో విధులు నిర్వహించి, జీవనం సాగిస్తూ ఉండేవాడిని. అక్కడ కూడా ఎటువంటి ఆదాయం అనుకున్నంత రాకపోవడంతో ఏమీ చేయలేక నిరాశతో అనేక ప్రయత్నాలు చేసిన తర్వాత స్వగ్రామైన అరసాడకు తిరిగి వచ్చి చేనేత వృత్తిలో కొనసాగాను. ఈ వత్తిలో కుటుంబమంతా కష్టపడాల్సిన పరిస్థితి ఉంది. చాలీచాలని ఆదాయంతో కుటుంబం మొత్తం కష్టపడిన చేనేత వృత్తిలో ఫలితం లేకపోవడంతో ఇటు చేనేత వృత్తి చేస్తూ, బొబ్బిలిల్లో విధులు నిర్వహిస్తూ, రెండు వైపులా కష్టపడుతూ చాలా అలసిపోయేవాడిని. ఈ నేపథ్యంలో ముగ్గురు ఆడపిల్లల బాధ్యతలు మరికాస్త పెరిగాయి. ఇంకా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. 52 ఏళ్లు పైబడడంతో శక్తి క్షీణించి, నిరాశలో ఉన్న నాకు 1998 ఉపాధ్యాయ అర్హత పరీక్ష లో ఉత్తీర్ణులైన మళ్లీ చిన్న ఆశ చిగురించి నా కుటుంబానికి భరోసాకు కారణమైంది. నాకు ఎటువంటి రాజకీయ పలుకుబడి లేకపోవడంతో నా గ్రామానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఎంటిఎస్ పద్ధతిపై జియ్యమ్మవలస మండలం లక్ష్మీపేటలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నాను. ఈ ఉద్యోగం నా కుటుంబానికి ఆసరాగా ఉపయోగపడుతుందని ఆశతో ఈ వయసులో కూడా విధి నిర్వహణకు సిద్ధమయ్యాను.

మగ్గంపై నేస్తున్న శీరాపు శంకరరావు (ఫైల్)

అందరికీ సంక్షేమ పథకాలు : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరేళ్ల పిల్లల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నట్లు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండల కేంద్రమైన గొల్లవీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లవీధి ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. ఇంటింటికి వెళ్లే జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో మళ్లీ వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ రంగునాయుడు, వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి.



పార్వతీపురం: బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

తూరుమామిడిలో జగనన్నే మా భవిష్యత్తు

మండలంలోని తూరుమామిడిలో జగనన్న మీ భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న శనివారం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడు, ఉపసర్పంచ్ చింతల గంగునాయుడు ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాల గురించి తెలిపారు. అనంతరం వారి సెల్ ఫోన్‌తో మిస్డ్‌కాల్ ఇచ్చి గోడకు జగనన్న స్టిక్కర్‌ను అతికించారు. రాబోయే కాలంలో జగనన్నకు మద్దతుగా ఉండాలని ప్రజలను మీకు ఎటువంటి సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం

పార్వతీపురం రూరల్ : సంక్షేమ పథకాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో శనివారం 204వ రోజున చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమ సహాయాన్ని తెలిపారు. అర్హత ప్రకారం సంక్షేమ పథకాలు అందుతున్నవా? లేదా? అని పరిశీలించి, అధికారులచే పర్యవేక్షించి అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పక అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, నాయకులు శేఖర్, నాగేశ్వరరావు, ఎఎంసి చైర్ పర్సన్ ఎం భాగ్యశ్రీ, వైస్ ఎంపిపి సిద్ద జగన్నాథ రావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, మాజీ సర్పంచ్ తీళ్ల సుభద్రమ్మ, సివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: స్టిక్కర్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం

మంత్రి స్థాయిని దిగజార్చిన ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఎస్‌సిలకు అన్యాయం జరుగుతుంటే పల్లెత్తు మాట ఆడని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, చంద్రబాబు పర్యటనకు అడ్డంకులు కల్పించి అధినేత మెప్పు పొందాలని దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఎర్రగొండపాలెంలో చంద్రబాబు కాన్వాయ్ పై జరిగిన రాళ్లదాడిని శనివారం కృష్ణపల్లిలో ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, చివరికి దళిత ఉద్యోగులను కూడా వైసిపి ప్రభుత్వం బహిరంగంగా హత్యలు చేయిస్తుంటే నోరు మెదపలేని మంత్రి సురేశ్, తాను దళిత పక్షపాతినని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్నారు. డాక్టర్ అచ్చెన్నను ముఖ్యమంత్రి సొంత జిల్లాలో వేధించి చంపేస్తే ఈయన నోరు మెదపలేదన్నారు. దళితుడైన కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్సీ హత్యచేసి ఇంటికి డోర్ డెలివరీ చేస్తే ఎందుకు స్పందించలేదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే వేధిస్తే కావలిలో కరుణాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని, డాక్టర్ సుధాకర్ మృతికి ప్రభుత్వం కారణం కాగా ఆయన్ను పిచ్చివాడిగా చిత్రీకరించారని గుర్తు చేశారు. చీరాలలో కిరణ్‌ను హత్య చేసింది ఈ ప్రభుత్వంలోని పోలీసులేనని ఇటీవల జగన్ సొంత నియోజకవర్గంలో మహిళను రేప్ చేసి చంపారని ఇవేమీ మంత్రి సురేష్‌కు కనిపించలేదా అని ఎద్దేవా చేశారు. అధినేత మెప్పుకోసం మంత్రి స్థాయిలో ఉండి బట్టలు విప్పుకొని స్థాయిని దిగజార్చారని అన్నారు. ఈ సమావేశంలో అరుకు పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకట నాయుడు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలోని బోసు బొమ్మ జంక్షన్‌లో వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని టిడిపి ఇంఛార్జి జి.సంధ్యారాణి ప్రారంభించారు. మీకై మేము స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న చలివేంద్రంలో మజ్జిగని మండుటెండలో తిరుగుతున్న పాదచారులకు ఆమె పంపిణీ చేశారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఎండల్లో తిరగరాదని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్.మాధవరావు, సంస్థ అధ్యక్షుడు ఇప్పిలి దిలీప్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పాచిపెంట

జీవన ఎరువులతో విత్తన శుద్ధి చేసి నాటుకుంటే అపరాల్లో అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని విశ్వనాధపురం రైతు భరోసా కేంద్రంలో స్వచ్ఛ ఆర్‌బికెలో పాల్గొంటూ 70 రోజులు తక్కువ కాలపరిమితి గల చిరు సంచులలో ఉన్న మినుము రకం విబిఎన్ -8 రకానికి రైజోబియంతో విత్తన శుద్ధి చేయించారు. 10 కిలోల విత్తనానికి 250 గ్రాముల రైజోబియంను పట్టిస్తే కనీసం దిగుబడి 10 శాతం పెరుగుతుందన్నారు. దీనికిగానూ 250 గ్రాముల రైజోబియంను సరిపడా వేడి నీటిలో 50 గ్రాముల బెల్లం కలిపి 10 కిలోల విత్తనాన్ని దీనిలో వేసి విత్తన శుద్ధి చేసిన తర్వాత రెండు గంటల పాటు నీడలో ఆరబెట్టి వెతుక్కోవాలి. ఈ రైజోబియం తనకు కావాల్సిన నీటిని మొక్క వేర్ల నుంచి పొందుతూ మొక్క పెరుగుదలకు ఆరోగ్యానికి కావాల్సిన నత్రజని స్థిరీకరించి మొక్క గ్రహించేలా చేస్తుందన్నారు. అపరాలు వేర్లపై బుడిపెలులో ఈ రైజోబియం అభివృద్ధి చెంది గాలిలో ఉన్న నత్రజని గ్రహించి భూమిలో స్వీకరించి పంటకు అందించడం వల్ల పంట ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆర్‌బికె, రైతు భరోసా కేంద్రాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, దీనికి గాను సెలవు దినాల్లో తప్పనిసరిగా నెలలో ఏదో ఒక రోజు స్వచ్ఛ ఆర్‌బికె దినంగా పాటించి రైతు భరోసా కేంద్రాలను శుభ్రపర్చుకోవాలని రైతులకు వ్యవసాయ శాఖకు అనుసంధానంగా ఉండే ఆర్‌బికెలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు ఎక్కువ కాలం పొందుతాయని వచ్చే రైతులకు కూడా ఆహ్లాదకరంగా ఉంటుందని అన్నారు. కావున తప్పనిసరిగా స్వచ్ఛ ఆర్‌బికె పాటించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశించారు. కార్యక్రమంలో విశ్వనాధపురం రైతు భరోసా కేంద్రం వివిఎ మోహన్ పాల్గొన్నారు.

సీతంపేట: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట : మండలంలోని కీసరజూడు పంచాయలోని కారిగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వరి దిగుబడుల పెంపునకు ఆధునిక పద్ధతులు లైన్ షోయింగ్, శ్రీవరి, డ్రమ్స్ విధర్, జమున మోడల్, గురించి వివరించారు. చిరుధాన్యాల పంటలు ఎక్కువ ఉత్పత్తి అయినట్లయితే ఆరోగ్యం, ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు బదులుగా ఘనజీవామృతం, ద్రవజీవం పంచిగవ్య, పుల్లటి మజ్జిగ పురుగు మందులు బదులుగా నీమాస్త్రం అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ణి కషాయం ఉపయోగించాలని సూచించారు. నీమాస్త్రం సామూహికంగా తయారీలో కారిగూడ, దిబ్బుగూడ, దిగువ కలువరాయి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ నుండి ఎసిఒ ఎం.గోపాలరావు, సిఒ బి.జగ్గయ్య, జెడ్‌బిఎన్‌ఎఫ్ ఐసిఆర్‌పి ఎల్.బాలరాజు, రవి పాల్గొన్నారు.

పాచిపెంట: విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్ మాసమని ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం ముస్లిం మత పెద్దలు మహ్మద్ అస్లాక్, షేక్ ఆశ్లాఉద్దీన్ ఆహ్వానం మేరకు బెలగాం బైపాస్ రోడ్ ప్రాంతాలలో ఉన్నటువంటి మసీదులలో నిర్వహించే రంజాన్ పండుగ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ మసీద్ నిర్మాణాలలో సహకారం అందించాలని ముస్లీం పెద్దలు కోరారు. అనంతరం జమ్మానను సత్కరించారు. ఈ మాసంలో రోజుకు ఐదు పర్యాయాలు నమాజ్‌తో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. అనంతరం తన సొంత నిధులతో వారికి పండుగ సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఎంపిటిసి కరీం సులేమాన్ పాషా, ఖాజా హుస్సేన్, షేక్ సలీం, ఎస్.ఎం.బాషా, అబ్దుల్ ముషీం, షేక్ సలీం, షేక్ శాదీబ్, షేక్ సత్తార్, షేక్ వాహ్బుత్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం: రంజాన్ తోఫాను అందిస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్

కురుపాం: రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లిములు

కురుపాం : మండల కేంద్రంలో గల శివన్నపేటలోని జమా మసీదులో రంజాన్ పండగ దినోత్సవం పురస్కరించుకొని ముస్లిములు మతగురువు అయిన మౌలాన్ సర్దార్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు రంజాన్ మాసం ఆవశ్యకత గూర్చి పండగను ఈనెల జరుపుకోవడానికి గల కారణం వివరిస్తూ ముస్లింలకు పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిన రంజన్ మాసం కాబట్టి ఎంతో పవిత్రంగా భావించాలని అన్నారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలు దాన, ధర్మాలు చేపట్టాలని నెలవంక రాకతో ప్రారంభమై మళ్లీ నెలవంక రాకతో ముగుస్తుందని అన్నారు. కావున ఈ నెలలో రంజాన్ పండుగ జరుపుకుంటారని హితోపదేశం చేశారు. ఈ ప్రార్ధనల్లో ముస్లింల కుటుంబాలతో సహ పిల్లలు పెద్దలు పాల్గొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్ మోహన్ రావు అన్నారు. శనివారం పట్టణంలో 22, 23 వార్డుల్లో చిన్నారుల టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు. వ్యాక్సిన్ ప్రారంభించిన సమయాన్ని, వివిఎం (శీతోష్ణ స్థితి) వయల్ పై పరిశీలించారు. అర్హుల జాబితా, అత్యవసర మందుల కిట్, హబ్ కట్టర్, ఉపయోగించిన సిరంజీలు, ఆర్సిహెచ్ రిజిస్టర్లు, టీకా కార్డుల్లో తారీఖులు, మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించే పోస్టర్లు, బ్యానర్లు, టీకా కార్యక్రమం జరుగుతున్న ప్రదేశంలో వెంటిలేషన్ స్థితిని మొదలగు వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకా నిర్వహణ మార్గదర్శకాలను టీకా కార్యక్రమంలో వైద్య సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే సిబ్బంది చిన్నారులకు, గర్భిణీలకు టీకా వేస్తున్న విధానాన్ని నిశితంగా పరిశీలించి, నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి టీకా గడువు తేదీలను సిబ్బంది తెలియ జేస్తున్నదీ, లేనిదీ అడిగారు. టీకా కార్డులను భద్రపరచుకోవాలని, వేసవిలో పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డిఐఒ జగన్మోహనరావు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ బి.పుష్ప, ఎఎన్ఎమ్‌లు ఉమామహేశ్వరి, విజయ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో గిరిజనులకు అన్యాయం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఎన్నికల ముందు గిరిజనులను ఉద్ధరిస్తామంటూ మాయ మాటలు చెప్పి అధికారంలోకి రాగానే వారి సంక్షేమ పథకాలను అటకెక్కించిన ముఖ్యమంత్రి జగన్ అని మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. శనివారం మండలంలోని డోకిశిలా పంచాయితీ మునక్కాయ వలసలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు వేరే పథకాలకు మళ్లించిన ఘనత ఈ ప్రభుత్వా నిదన్నారు. చంద్రబాబు హయాంలో ఐటిడిఎల ద్వారా అమలు చేసిన పథకాలన్నీ నిలిపివేసి ఐటిడిఎలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రాబోయే కాలంలో టిడిపికి మద్దతుగా నిలిచి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిఎ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి బంకపల్లి అశోక్, బుడితి శ్రీరామ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

పిడుగుపాటుకు కూలీ మృతి



మృతుడు అప్పారావు

శృంగవరపుకోట : ఎప్పటిలాగే భార్యభర్తలు ఇద్దరు కలిసి ఇటుకుల బట్టిలో పనిచేసేందుకు వెళ్లారు. అయితే వీరిలో భర్తపై ఆకస్మాత్తుగా అగ్గిపిడుగు పడటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. భార్య తమ వెంట తెచ్చుకున్న వాటర్ బాటిల్ ను పక్కన పెట్టేందుకు వెళ్లడంతో తటిలో మత్యువునుంచి తప్పించుకుంది. ఈ సంఘటన ఎస్.కోట మండలంలోని కొట్టాం జంక్షన్ సమీపంలోని మామిడిపల్లి గ్రామ పెద్ద చిట్టిపోలు రమణ ఇటుకుల బట్టి వద్ద శనివారం నాలుగు గంటల సమయంలో చోటుచేసుకుంది. మామిడిపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన బొంగరాల అప్పారావు(45) తన భార్య లక్ష్మణ ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట పనికి వెళ్తారు. శనివారం కొట్టాం జంక్షన్లో వున్న ఇటుకుల బట్టీకి పనికి వెళ్లారు. ఉదయమంతా పనిచేసి రెండు గంటల సమయంలో భార్యభర్తలు ఇద్దరు కలిసి బోజనం చేశారు. కాసేపు విశ్రాంతి తీసుకుని మూడుగంటల సమయంలో మరోసారి పని మొదలు పెట్టారు. ఈసమయంలో వర్షం మొదలుకావడంతో పాటు ఉరుములు వచ్చాయి. ఆ సమయంలో లక్ష్మణ తమతో తెచ్చుకున్న వాటర్ బాటిల్ తడిసిపోతుండటంతో పక్కన పెట్టేందుకు వెళ్లింది. ఆమె వెళ్లిన క్షణాల వ్యవధిలోనే తన భర్త అప్పారావుపై పెద్దఎత్తున పిడుగు పడి సంఘటన స్థలంలో శరీరం కాలిపోయి చనిపోవడం చూసి మూర్చపోయింది. గమనించిన చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకొని అప్పారావును చూడగా అప్పటికే చనిపోయాడు. అతని భార్యకు సపర్యలు చేసి తేరుకునేలా చేశారు. ఎప్పుడూ భార్యభర్తలు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, పిడుగు వారి కుటుంబంలో విషాదం నింపిందని ఆవేదన చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, వృద్ధురాలైన తల్లి ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.